చదవండి! చదివించండి !! ఆలోచించండి!!!

# బడుగు బాంధవులా, వ్యతిరేకులా ?

**సూర్య దినపత్రిక సౌజన్యంతో 12-7-2011 తేదీ మంగళవారం బి.సి. యునైటేడ్ ఫ్రంట్ అధ్యక్షులు శ్రీపాలూరి రామకృష్ణయ్య గారు** రాసిన "బడుగు బాంధవులా, వ్యతిరేకులా?" అనే శీర్షికను యధాతథంగా అందిస్తున్నాము దీనిని చదవి, చదివించి, ఆలోచించమని మనవిచేస్తూ...

ఇటు కాంగ్రెస్, అటు జగన్మోహన్‌రెడ్డి వై.యస్.ఆర్. కాంగ్రెస్- వై.యస్. రాజశేఖర్‌రెడ్డి వారసత్వానికి జై కొట్టడం బడుగులను మోసం చేయడమే! దివంగత ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్‌రెడ్డి తనయుడు జగన్ - వై.ఎస్.ఆర్. ప్రారంభించిన సంక్షేమ పథకాలను బడుగు బలహీనవర్గాలకు ప్రారంభించిన ఫీ రియింబర్స్‌మెంట్ రాయితీలను నిర్విఘ్నంగా కొనసాగించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తాడని పార్టీ గౌరవాధ్యక్షురాలు విజయమ్మ ప్రకటించగా, ఇటు కాంగ్రెస్ అగ్రనాయకత్వం కూడా వై.యస్.ఆర్. చిత్రపటానికి పూలమాలలు వేసి పోటాపోటీలుగా జేజేలు కొ్టడం గురించి ప్రజానీకం పునరాలోచించుకోవాలి. దివంగత వై.ఎస్.ఆర్. బడుగు బాంధవుడని ఆయన వందిమాగధులు ముమ్మురంగా రాష్ట్రంలో ప్రచారంచేస్తున్నారు. ఇంతకీ ఆయన బడుగులకు ఏం చేశారన్నది ఒకసారి పరిశీలించాల్సిన అవసరముంది.

**మొట్టమొదటగా**, విస్తత ప్రచారం జరిగిన ఫీ రియింబర్స్‌మెంట్ పథకం అమలును గమనిస్తే, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు జరిగిన మేలు అనంతమయితే-అదే స్థాయిలో రెడ్డి, క్రైస్తవ, కమ్మ వర్గాలు స్థాపించిన ఉన్నత విద్యా కళాశాలలు విద్యార్థులు లేక దివాలాతీస్తున్న దశలో, వారిని ప్రభుత్వ ఖజానాల నుండి ఫీ రియింబర్సుమెంటు నిధుల ద్వారా ఆదుకొనడం కూడా జరిగిందనేది ఈ పథకంలో ముఖ్యాంశమే. ఏది ఏమైనా ఈ పథకం ద్వార బడుగు విద్యార్థులు లాభపడే అవకాశం ఉంది. ఈ ఒక్క పథకం తప్ప , ఇక అన్ని వై.ఎస్.ఆర్. పథకాలూ బడుగులను మోసం చేసినవే. అవేమిటో ఒకసారి ప్రజల ముందుకు చర్చకు తేవాల్సిన అవసరం ఉంది.

విద్య, ఉద్యోగ రంగాలలో బీసీలకు 25 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుచున్న విషయం అందరికీ తెలిసినదే. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం గరిష్ఠ పరిమితి ప్రకారం, ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 6 శాతం ఇవ్వగా - మిగిలిన 29 శాతం బీసీలకు అందవలసి ఉన్నది. ఆ ప్రకారం బడుగు బాంధవుడనని ప్రచారం పొందిన వై.యస్.ఆర్. న్యాయంగా బీసీలకు ప్రస్తుతమున్న 25 శాతాన్ని 29 శాతానికి పెంచాల్సిన అవసమున్నప్పటికీ, చేసిందేమిటి ? ముస్లిం సోదరుల ఓట్లు దండుకొనేందుకు - కేంద్రాన్ని అంగీకరింప జేసి, మైనారిటీలకు వారి జనాభా ప్రాతిపదికన కొత్తగా రిజర్వేషన్ కల్పించకుండా, బీసీలకు చెందవలసిన వాటా అయిన 4 శాతాన్నే ముస్లింలకు ఇచ్చారు. అందువల్ల బీసీలకు తీవ్ర అన్యాయం చేయడమే కాకుండా, సోదరులుగా కొనసాగుతున్న బీసీ, ముస్లీంల మధ్య తీవ్ర వైరాన్ని సృష్టించారు ! ఎలాగైతే తెలుగు దేశం అధినేత చంద్రబాబు నాయుడు ఎస్సీల వర్గీకరణ పేరుతో మాల, మాదిగల మధ్య బద్ధ శత్రుత్వాన్ని కల్పించగలిగారో - అలాగే తానూ ఏమీ తక్కువ కాదన్నట్టు వై.యస్.ఆర్, బీసీ, మైనారిటీ వర్గాల మధ్య చిచ్చు పెట్టారు. అంతే కాకుండా కేవలం విద్య, ఉద్యోగ రంగాలలోనే ముస్లింలకు 4 శాతం ఇస్తున్నామని జీఓలో పేర్కొన్నప్పటికీ, మాట తప్పి స్థానిక సంస్థలలో బీసీలకున్న - మున్సిపాలిటీలలో 33 శాతం, మండల, జిల్లా పరిషత్‌లలో ఉన్న 34 శాతానికి గండి కొట్టి - అందులో నుంచి 4 శాతాన్ని తగ్గించి, ముస్లింలకు కల్పించడం జరిగింది. ఇది మొట్టమొదటి అన్యాయం.

**రెండవ అన్యాయం** - బీసీ జాబితాలోని 94 కులాలకు 25 శాతం రిజర్వేషన్లు విద్య, ఉద్యోగ రంగాలలో ఉన్న దశలో, అందులో 26 హిందూ కులాలను, 15 ముస్లిం చేతివృత్తుల వర్గాలనూ చేర్చి, బీసీజాబితాను 135 కు పెంచడం జరిడింది. మరి 41 కులాలను కలిపినప్పటికీ గతంలో ఉన్న 25 శాతం రిజర్వేషన్లును పెంచకుండా అలానే ఉంచిన నేపథ్యంలో, బీసీలకు అన్యాయం జరిగిందా, లేక మంచి జరిగిందా అనేది గమనించాలి. **ఇక మూడవ అన్యాయం** - తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు హయాంలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు చట్టసభలలో కల్పించాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి పంపగా, తానేమి తక్కువ తినలేదని వై.ఎస్.ఆర్. కూడా 2008లో 33 శాతం సీట్ల రిజర్వేషన్‌కు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, రాజ్యాంగ సవరణ ద్వారా కల్పిస్తానని వాగ్దానం చేశారు. అయితే, కొన్ని నెలల అనంతరం 2009 ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికలలో - శాసనసభకు 294 సీట్లు, లోక్ సభకు 42 సీట్ల కేటాయింపు తన పరిధిలో ఉండి కూడా - తాను అసెంబ్లీలో బీసీలకు 33 శాతం సీట్ల కేటాయింపుపై ఏకగ్రీవ తీర్మానం చేయించి కేంద్రానికి పంపిన సంగతిని కూడా పూర్తిగా విస్మరించి-కేవలం 38 సీట్లు కేటాయించి, న్యాయప్రకారం చట్ట సభలలో ప్రవేశించాల్సిన బీసీల సంఖ్యకు గండి కొట్టారు.

**ఇక నాల్గవ అన్యాయం** - రాజీవ్ గృహకల్ప, ఇందిరా గృహపథకం, క్రాంతి పథకాలను కేవలం బీసీ, ఎస్సీ, ఎస్టీలకే లభించేటట్లు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మన రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన తరగతులను కూడా ఈ పరిధిలో చేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ముసుగులో అగ్రకులాల ప్రజాప్రతినిధుల అనుచరుల పేర్లను కూడా చేర్చి, బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం చేసింది.

**ఐదవ అన్యాయం** - మహిళా సంక్షేమం, పావలా వడ్డీ తదితర పథకాలను ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పేరుతో అగ్రకులాల వారి చేతిలోనే ఉంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు నష్టం చేసింది. ఇలా బడుగు స్త్రీలకు అన్యాయం జరిగింది. అలాగే లక్షల కోట్ల రూపాయలను జలయజ్ఞంపేరిట కాంట్రాక్టర్లకు ముందుగానే సొమ్ముచెల్లించి రాష్ట్ర ఖజానాకు గండి కొట్టింది. ఆ ప్రాజెక్టుల పరిధిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేవలం 5 శాతం కంటే ఎక్కువ భూమి లేదనేది తెలిసిన విషయమే. జలయజ్ఞం పేరుతో వందల ప్రాజెక్టుల కోసం లక్షల కోట్ల రూపాయలను అగ్రకులాల ప్రయోజనం కోసమే విడుదల చేశారనేది విస్మరించలేని సత్యం!

**ఆరవ అన్యాయం** - శాసనసభ సీట్ల కేటాయింపులో 100 సీట్లు అధికారికంగా, రిజర్వేషన్ల ద్వారా కేటాయిస్తానన్న రాజశేఖరరెడ్డి 38 సీట్లు మాత్రమే కేటాయించారు. అలాగే, సుమారు 550 నామినేటెడ్ పోస్టులను భర్తీచేస్తే - వాటిలో దాదాపు 493 సీట్లు తనదైన రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించారనేది జగమెరిగిన సత్యం! బీసీలకే కాదు, ఎస్సీలకు సబ్ ప్లాన్‌లో, కేంద్ర ఎస్సీ పరిశ్రమల పాలసీలో కూడా అన్యాయం జరిగింది. ఈ విషయమై దళిత వర్గాలు ఉద్యమాలు సైతం నిర్వహిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో దివంగత రాజశేఖర్‌రెడ్డి బడుగు బాంధవుడా, లేక బడుగు వ్యతిరేకా అనేది - ఆయనకు జేజేలు కొట్టే వై.ఎస్.ఆర్. కాంగ్రెస్, అదే స్థాయిలో మరిన్ని జేజేలతో ముంచేత్తుతున్న కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు వివరించాల్సిన అవసరముంది.

శీర్షికను యథాతథంగా అందిస్తున్నవారు

**బి.సి. ఉద్యోగుల సంక్షేమ సంఘం,**

కదిరి తాలూకా శాఖ, అనంతపురం జిల్లా.